# రిజిష్ట్రేషన్ ఆఫీసులకు ఏసీబీ దడ

**తిమ్మాపూర్ లో అప్రమత్తమైన ఉద్యోగులు**
**దూరంగా డాక్యుమెంటేటర్లు, బోర్డులు**
**మాయం.. అవినీతి ఆగేనా**

ఏసీబీ.. అక్రమార్కులైన ప్రభుత్వ అధికారులు, ఉద్యోగుల భరతం పట్టే శాఖ. అప్పుడప్పుడు రాష్ట్ర వ్యాప్తంగా శాఖల వారిగా దాడులు నిర్వహిస్తుంటుంది. ఇదే క్రమంలో ఇటీవల రాష్ట్రంలోని సబ్ రిజిస్ట్రేషన్ ఆఫీసులపై ఏసీబీ కొరడా ఝులిపించింది. దీంతో సబ్ రిజిస్ట్రేషన్ ఆఫీసుల్లో ఉద్యోగులు అలర్ట్ అయ్యారు. కరీంనగర్ జిల్లాలో అదే జరిగింది. తిమ్మాపూర్ మండల కేంద్రంలోని సబ్ రిజిస్ట్రేషన్ ఆఫీసులో ఉద్యోగులు అప్రమత్తమయ్యారు. అంతే గతమును మరచిన ఉద్యోగులు ప్రస్తుతం తాము సచ్ఛీలులమనేలా వ్యవహరిస్తున్నారు.






తిమ్మాపూర్, జనతా న్యూస్ :
కరీంనగర్ జిల్లాలో రిజిస్ట్రేషన్ల శాఖకు ఆదాయాన్ని తెచ్చి పెట్టే ఆఫీసుల్లో తిమ్మాపూర్ సబ్ రిజిస్ట్రేషన్ ఒకటి. అత్యధిక డాక్యుమెంట్లు అయ్యే ఆఫీసుల్లో తిమ్మాపూర్ మొదటి మూడు స్థానాల్లో ఉంటుంది. ఇక్కడ రిజిస్ట్రేషన్ల సంఖ్యనే కాకుండా డాక్యుమెంట్ రైటర్లు ఎక్కువగానే ఉంటారు. కార్యాలయం ప్రతీ రోజు డాక్యుమెంట్ రైటర్లతో కళకళలాడుతుంటుంది. రిజిస్ట్రేషన్ ఏదీ కావాలన్నా మధ్యలో డాక్యుమెంటేటర్లు దర్శనమిస్తున్నారు. అయితే ప్రభుత్వానికి చెల్లించాల్సిన సొమ్ముకంటె కొసరు సొమ్ము భారం క్రయ, విక్రయదారులపై పడుతోంది. ప్లాట్లు, ఇండ్లు, తనఖా డాక్యుమెంట్లు, పెళ్లిళ్ల రిజిస్ట్రేషన్, తదితర లావాదేవీలకు సంబంధించిన డాక్యుమెంట్ల విషయంలో క్రయ, విక్రయదారులపై పడుతున్న అదనపు భారం తడిసి మోపెడవుతోంది. రిజిస్ట్రేషన్ ఏదీ కావాలన్నా ముందుగా అధికారులను డాక్యుమెంట్ రైటర్లు సంప్రదించి అసలు, కొసరు మాట్లాడితేనే రిజిస్ట్రేషన్ ప్రక్రియ కొనసాగుతుందనే ఆరోపణలున్నాయి. అధికారులు, ఉద్యోగులు చేతికి మట్టి అంటకుండా డాక్యుమెంట్ రైటర్ల ద్వారా అందినకాడికి అక్రమ సంపాదనను అందుకుంటున్నారనే తెలుస్తోంది. ఒక్కో రోజుకు అవినీతి ఆదాయం లక్షల్లోనే ఉంటుందనే చర్చ జోరుగా సాగుతోంది. సాయంత్రం పూట లెక్కలేసుకుని డాక్యుమెంట్ రైటర్ల నుండి డబ్బులు వసూలు చేసుకుని ఇంటికి వెళ్తారనే విమర్శలున్నాయి. అవినీతి సొమ్మును సైతం నేరుగా తీసుకోకుండా అటెండర్ ద్వారానే అందుకుంటారనే గుసగుసలున్నాయి. సబ్ రిజిస్ట్రార్ సీట్ పవర్ ఫుల్ కావడంతో ఆ సీటు కోసం ఎదురుచూస్తుంటారని, ఆఫీసర్ సెలవు పెడితే ఆ రోజు సీటు కోసం వచ్చే ఉద్యోగులున్నారని ఆరోపణలున్నాయి. అంతేకాదు తానే ఇంచార్జిగా ఉంటానని, ఆ రోజు డాక్యుమెంట్లు తెచ్చుకోవాలని సూచనలు చేసి మరీ డాక్యుమెంట్ రైటర్లను రప్పించుకుంటారనే చర్చ సాగుతోంది. మామూలుగా ఒక్కో రిజిస్ట్రేషన్ కి రూ.5వేలు, ఆ పైనే మామూళ్లు వసూలు చేసుకుంటారనే ఆరోపణలున్నాయి. ప్రభుత్వ నిబందనలు పాటించకుండానే మామూళ్లు తీసుకుంటూ రిజిస్ట్రేషన్లు చేస్తున్నారనే విమర్శలున్నాయి. పని చేసుకుని వెళ్లాలనే ఆలోచనతో అడిగినకాడికి ఇచ్చుకుంటూ క్రయ, విక్రయ దారులు డాక్యుమెంట్లు చేయించుకుంటున్నట్లు తెలుస్తోంది.

**ఏసీబీ దడ...**

సబ్ రిజిస్ట్రేషన్ ఆఫీసులకు ఏసీబీ దడ పట్టుకుంది. ఇటీవల ఏసీబీ దాడులు జరుగడంతో తమ ఆఫీసుకు ఎప్పుడు వస్తారా అంటూ భయంభయంతో సబ్ రిజిస్ట్రేషన్ ఆఫీసు ఉద్యోగులు పనులు చేస్తున్నారు. అయితే గతంలో మాదిరిగా కాకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. తిమ్మాపూర్ సబ్ రిజిస్ట్రేషన్ ఆఫీసులో ఉద్యోగులు ఇప్పటికే బయటి వారికి హెచ్చరికలు జారీ చేసినట్లు సమాచారం. డాక్యుమెంట్ రైటర్లను ఆఫీసులోకి రాకుండా దూరంగా ఉంచుతున్నారు. ఏదానై ఉంటే ఫోన్ లోనే మాట్లాడాలని, లేదంటే బయట కలిసి మాట్లాడాలని చెప్పినట్లు తెల్సింది. ఆఫీసు చుట్టూ ఉన్న డాక్యుమెంట్ రైటర్లు బోర్డులు పెట్టుకోవద్దని సూచించినట్లు సమాచారం. అందుకే కొందరు డాక్యుమెంటేటర్లు తమ షెటర్లకు బోర్డులను తొలగించినారు. ఏసీబీ అధికారులు వస్తారానే సమాచారం తిమ్మాపూర్ సబ్ రిజిస్ట్రేషన్ ఆఫీసు ఉద్యోగులకు ఉన్నట్లు స్పష్టమైంది. అయితే ఎప్పుడు వస్తారు అనేది తెలియకపోవడంతో నిత్యం అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారు. గతంలో మాదిరిగా కాకుండా కొద్ది రోజుల నుండి తక్కువ డాక్యుమెంట్లను తీసుకుని రిజిస్ట్రేషన్లు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఏసీబీ దడ నిత్యం ఉండేలా చూడాలని, దోపిడీ, అవినీతి వ్యవహారం అగేలా చూడాలని కోరుతున్నవారనేకం. అయితే ఏసీబీ అధికారులు వీటన్నింటిని గమనించి పకడ్బందీ వ్యూహంతో దాడులు నిర్వహిస్తే తిమ్మాపూర్ సబ్ రిజిస్ట్రేషన్ ఆఫీసులో అవినీతి భాగోతం గుట్టురట్టు అయ్యే అవకాశం ఉంటుందని స్థానికులు చర్చిస్తున్నారు.

# గమ్యం, ప్రాణం ముఖ్యమే

**మానవ తప్పిదాలతోనే ప్రమాదాలు**
**జాగ్రత్తలు పాటిస్తే సురక్షిత ప్రయాణం**
**కరీంనగర్ సీపీ గౌస్ అలామ్**



తిమ్మాపూర్, జనతా న్యూస్ : ప్రతి వ్యక్తికి గమ్యంతో పాటు ప్రాణం ముఖ్యమేనని, ఎరైవ్, ఎలైవ్ నినాదంతో ముందుకు సాగాలని కరీంనగర్ సీపీ గౌస్ ఆలం తెలిపారు. ప్రమాదాల నివారణకు తిమ్మాపూర్ సిఐ ఆఫీస్ లో కరీంనగర్ రూరల్ ఏసిపి విజయ్ కుమార్, సీఐ సదన్ కుమార్, ఎస్ఐలు శ్రీకాంత్ గౌడ్, నరేందర్ రెడ్డితో సమీక్ష నిర్వహించారు. అనంతరం రాజీవ్ రహదారిపై నడుచుకుంటూ ప్రమాదాల విషయమై పోలీస్ లతో చర్చించారు. అనంతరం తిమ్మాపూర్ మండలం రామకృష్ణ కాలనీలోని వాగేశ్వరి కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం జాతీయ సేవా పథకము (ఎన్ఎస్ఎస్) ఆధ్వర్యంలో రోడ్ సేఫ్టీ పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం హాజరై విద్యార్థులకు రోడ్డు భద్రత, నియమాల గురించి వివరించి తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అతివేగం హానికరమని, టూ వీలర్ పై ప్రయాగించేటపుడు హెల్మెట్ తప్పక ధరించాలని విద్యార్థులకు తెలియజేశారు. మద్యం సేవించి వాహనం నడపరాదని, చలికాలంలో మంచు వల్ల రోడ్డు స్పష్టంగా కనిపించకపోవడం కూడా ప్రమాదాలకు ఒక కారణమని దానికి తగిన విధంగా జాగ్రత్తలు తీసుకొని నెమ్మదిగా ప్రయాణం చేయాలని తెలిపారు. కరీంనగర్ జిల్లాలో గడిచిన పది నెలల్లో పది మర్డర్ లు జరిగితే ప్రమాదాల్లో 170 మంది ప్రాణాలు కోల్పోయారని, ఇందులో ఎక్కువగా రాజీవ్ రహదారిపైనే జరిగాయని తెలిపారు. మానవ తప్పిదాల వల్లనే అత్యధిక ప్రమాదాలు జరుగుతున్నాయని అన్నారు. జాగ్రత్తలు తీసుకుంటే ప్రమాదాలు నివారించవచ్చని, జీవితం రిస్కు చేసుకోవద్దని సూచించారు. ప్రయాణంలో తప్పు ఎవరిదైనా ప్రాణాలు పోవడం, ఎన్నో కుటుంబాలు రోడ్డున పడడం బాధను కలిగిస్తుంది అన్నారు. విద్యార్థులు సమస్యలు ఉంటే పోలీసులను కలవవచ్చని అన్నారు. అనంతరం రేణిగుంట నుండి అలుగునూర్ వరకు ఎల్ఎండి పోలీసులు ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు, బారికేడ్లు, ట్రాఫిక్ పోలీస్ బొమ్మలను సిపి పరిశీలించారు. జాయింట్ సెక్రటరీ డా. జి. శ్రీనివాస్ రెడ్డి , సి. హెచ్ ప్రకాష్ రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ డా. సి. హెచ్ శ్రీనివాస్, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్స్ డా. శ్రీనివాస్ రెడ్డి, డా.ఆర్.రామక్రిష్ణ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ ఆర్. సాయినాథ్, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి రెజ్లింగ్‌కు సుందరగిరి బాలికలు



చిగురుమామిడి,జనత న్యూస్:మండలంలోని సుందరగిరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థినులు రాష్ట్రస్థాయి రెజ్లింగ్ అండర్-17 పోటీలకు ఎంపికయ్యారు.కరీంనగర్‌లో గురువారం జరిగిన జిల్లాస్థాయి రెజ్లింగ్ పోటీల్లో వీరు ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి అర్హత సాధించారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాధికారి (ఎంఈఓ) వి. పావని శుక్రవారం వివరాలు వెల్లడించారు.హైదరాబాద్‌లోని క్లబ్ బజార్ ఘాట్‌లో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారని తెలిపారు. ఎంపికైన వారిలో 40 కిలోల విభాగంలో జి. శివాని, 43 కిలోల విభాగంలో వి. ఐశ్వర్య, 49 కిలోల విభాగంలో పి. సత్య, 69 కిలోల విభాగంలో మేఘ వర్షిత ఉన్నారు.ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థినులను మండల విద్యాధికారి పావని, పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ సఫియా, ఉపాధ్యాయ బృందం ఘనంగా అభినందించారు.రాష్ట్రస్థాయిలోనూ విజయం సాధించాలని వారు ఆకాంక్షించారు.

# ఘనంగా ప్రపంచ మత్స్యకార దినోత్సవం

**చేపల విక్రేతలకు సన్మానం**



హుస్నాబాద్,జనత న్యూస్:ప్రపంచ మత్స్యకార దినోత్సవాన్ని హుస్నాబాద్ చేపల మార్కెట్లో ముదిరాజ్ పోరాట సమితి ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు.సమితి రాష్ట్ర కార్యదర్శి జనవేని శ్రీనివాస్ ముదిరాజ్ ఈ కార్యక్రమానికి నేతృత్వం వహించారు.ఈ సందర్భంగా మార్కెట్‌లోని మత్స్యకారులు, చేపల విక్రేతలను ప్రత్యేకంగా సన్మానించారు. వారికి మిఠాయిలు తినిపించి, శుభాకాంక్షలు తెలియజేశారు.అనంతరం జనవేని శ్రీనివాస్ ముదిరాజ్ పోరాట సమితి నాయకులు మాట్లాడుతూ... మత్స్యకారుల అభివృద్ధి లక్ష్యంగానే ప్రపంచ మత్స్యకారుల దినోత్సవాన్ని జరుపుకుంటున్నామన్నారు. మత్స్యకారుల అభ్యున్నతి కోసం 1954 నవంబరు 21వ తేదీన కొంతమంది మేధావుల కృషి కారణంగానే ఈ దినోత్సవం మొదలైందని తెలిపారు. మగ, ఆడ చేప పిల్లలను ఒక తొట్టిలో వేయడం ద్వారా వాటి సంపర్కంతో అనేక చేప పిల్లలు పుట్టాయని, ఆ రోజును గుర్తుంచుకుంటూ ప్రతి సంవత్సరం నవంబరు 21న ఈ దినోత్సవాన్ని జరుపుకోవడం జరుగుతోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ పోరాట సమితి నియోజకవర్గ అధ్యక్షులు ఎడల రమేష్ ముదిరాజ్, ఉపాధ్యక్షులు కేశవేని రమేష్ ముదిరాజ్, హుస్నాబాద్ పట్టణ అధ్యక్షులు రాగుల శ్రీనివాస్ ముదిరాజ్, అక్కన్నపేట మండల అధ్యక్షులు కాశ బోయిన రవి ముదిరాజ్, మత్స్య శాఖ అధ్యక్షులు పోన్నం మల్లయ్య ముదిరాజ్, పినకాశి రమేష్ ముదిరాజ్, చింతల బాలరాజు ముదిరాజ్, మాచర్ల చందర్ ముదిరాజ్, ఐలయ్య ముదిరాజ్, మీర్జాపూర్ మత్స్య శాఖ అధ్యక్షులు సంపత్ ముదిరాజ్ సహా ముదిరాజ్ ముఖ్య నాయకులు, కులస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# చిగురుమామిడి మండలంలో విషాదం..

**వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు దుర్మరణం**



చిగురుమామిడి,జనత న్యూస్:కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలంలో వేర్వేరు చోట్ల జరిగిన రెండు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు వ్యక్తులు దుర్మరణం పాలయ్యారు. రోడ్డు భద్రతా నియమాలు పాటించకపోవడం, అతివేగం కారణంగానే ఈ ప్రమాదాలు సంభవించినట్లు పోలీసులు ప్రాథమికంగా భావిస్తున్నారు. ఈ రెండు ఘటనలపై చిగురుమామిడి ఎస్సై సాయికృష్ణ కేసులు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

**కొండాపూర్ శివారులో ద్విచక్రవాహనం బోల్తా**

నవంబర్ 21, శుక్రవారం అర్ధరాత్రి సుమారు 00:30 గంటల ప్రాంతంలో కొండాపూర్ గ్రామం వెలుపల ఈ ఘోర ప్రమాదం జరిగింది. సుందరగిరి నుంచి హుస్నాబాద్ వైపు వెళుతున్న %ఝా15జుఎ%4957 నెంబరు గల పల్సర్ ద్విచక్ర వాహనం అదుపు తప్పింది. వేగం కారణంగా నియంత్రణ కోల్పోయిన వాహనం రోడ్డు పక్కనే ఉన్న పొదల్లోకి దూసుకెళ్లింది.ఈ ఘటనలో వాహనాన్ని నడుపుతున్న గగిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన దొంతరవేని విజయ్ కుమార్ (22) తలకు తీవ్ర గాయాలయ్యాయి.రక్తస్రావం అధికమవడంతో అతడు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. వెనుక కూర్చున్న వ్యక్తికి స్వల్ప గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

**టీవీఎస్ ఎక్స్ఎల్ ను ఢీకొట్టిన ట్రాక్టర్**

మండలంలోని సుందరగిరి-గగిరెడ్డిపల్లి మార్గంలో మరొక ప్రమాదం జరిగింది. సుందరగిరి గ్రామ శివారులో పొలాల దారి నుండి మెయిన్ రోడ్డులోకి ఆకస్మాత్తుగా వస్తున్న ఓ ట్రాక్టర్.. అటుగా వెళ్తున్న %ఱూ ఞూ% ద్విచక్ర వాహనాన్ని వెనుక భాగం నుంచి బలంగా ఢీకొట్టింది.ప్రమాద తీవ్రతకు సుందరగిరి గ్రామానికి చేందిన ద్విచక్ర వాహనదారుడు గందె రాజయ్య (69) తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు వెంటనే స్పందించి అంబులెన్స్‌లో అతడిని హుస్నాబాద్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. అయితే, అప్పటికే రాజయ్య మరణించినట్లు వైద్యులు నిర్ధారించారు. చిగురుమామిడి ఎస్ఐ సాయికృష్ణ కేసు నమోదు చేసి, రెండు ఘటనలపై విచారణ కొనసాగిస్తున్నారు. రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు ప్రతి ఒక్కరూ విధిగా హెల్మెట్ ధరించాలని, మద్యం సేవించి వాహనాలు నడపవద్దని పోలీసులు ప్రజలకు విజ్ఞప్తి చేశారు.





